

మాట్లాడుతున్న గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్

గీత కార్పొరేషన్ ద్వారానే నీరా కేఫ్‌ను నిర్వహించాలి

రాంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గీత కార్పొరేషన్ ద్వారానే నీరా కేఫ్‌ను నిర్వహించాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నీరా కేఫ్ నిర్వహణపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ ఆగస్టు 18వ తేదీ వరకు జనగామ జిల్లాను సర్దార్ పాపన్న గౌడ్ జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న గీతకార్మికుల నష్టపరిహారం చెల్లించాలన్నారు. నందనం నీరా పరిశ్రమను వెంటనే ప్రారంభించాలని, గీతన్నలకు కొత్త పెన్షన్ ఇవ్వాలన్నారు. ఉత్తర తెలంగాణలో గీత వృత్తిపై జరుగుతున్న వీడీసీల దాడులను అరికట్టాలన్నారు. ప్రతి జిల్లాలో నీరా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఆరోగ్య కార్డులు ఇవ్వాలన్నారు. చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణగౌడ్, సర్వాయిపాపన్న మోపు దెబ్బ అధ్యక్షుడు జక్క వీరస్వామి, బీజేపీ గీత మోర్చా అధ్యక్షుడు పటేల్ వెంకటేష్‌గౌడ్, జై గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బూర మల్సూర్, సోషల్ డెమోక్రటిక్ జాతీయ అధ్యక్షుడు కోల జనార్దన్, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, వేములయ్య, యాదగిరిగౌడ్, రామ్మోహన్‌గౌడ్, పరుశరామ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసిన సంఘం ఫౌండర్ చైర్మన్ రాంచందర్‌గుప్త, అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త ప్రతినిధులు తదితరులు

ఆర్యవైశ్య విద్యార్థులకు పురస్కారాల ప్రదానం

గోల్నాక, మే 26 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం ఆర్యవైశ్య సంఘం తమ సామాజిక వర్గం అభ్యున్నతికి, ఇతరసామాజిక వర్గాలకు నిర్వహిస్తున్నామని సంఘం ఫౌండర్, చైర్మన్ కొర్తివాడ రాంచందర్‌గుప్త అన్నారు. సోమవారం అంబర్‌పేట నియోజకవర్గం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో 90శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఆర్యవైశ్య విద్యార్థినీ, విద్యార్థులకు ఛేనెంబర్ శ్రీనివాసనగర్ కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో జరిగిన కార్యక్రమంలో 50మంది విద్యార్థులకు క్యాష్ అవార్డు,మెడల్, ప్రశంసాపత్రాలతో సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా రాంచందర్ గుప్త మాట్లాడుతూ తమ సంఘం నాలుగేళ్ల నుంచి నియోజకవర్గంలోని ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌గుప్త, ప్రధానకార్యదర్శి జైన శ్రీనివాస్‌గుప్త, కోశాధికారి వాసుగుప్త, ప్రతినిధులు వి.వెంకటేష్‌గుప్త, ప్రకాష్‌గుప్త, బి.రాజుగుప్త, కె.సుధాకర్‌గుప్త, ప్రణీత్‌గుప్త, తిరుపతిగుప్త, అల్లాడి సుధాకర్‌గుప్త, ఎం.రమేష్ పి.వెంకటరమణ, ఎం.సత్యనారాయణ, రవీందర్, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

మిస్ మిల్లా ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలి

రాంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా ఇంగ్లాండ్ నుంచి పాల్గొన్న మిస్ మిల్లామాగీ పోటీల నిర్వాహకుల తీరు, మిస్ వరల్డ్ సంస్థలపై చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు అరుణజ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తమను వేశ్య కంటే అధ్వానంగా చూశారని, విందు ఏర్పాటు చేసిన సందర్భంగా మధ్య వయసు ఉన్న పురుషులను సంతోష పెట్టాలని వేధించారని మిల్లామాగీ చేసిన ఆరోపణలపై బయటపెట్టాలన్నారు. ప్రపంచ దేశాలకు తెలంగాణ రాష్ట్ర కీర్తిని చాటుతామని చెప్పి నిర్వహణలో మన రాష్ట్ర పరువును నిలదీశారని ఆరోపించారు. మిస్ మిల్లామాగీపై తప్పుగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



బీసీ రాజ్యాధికార సమితి కోటి సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాసు సురేష్

బీసీ రాజ్యాధికారమే లక్ష్యం

రాంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాధికారాన్ని సాధించి ఇవ్వడమే బీసీ రాజ్యాధికార సమితి లక్ష్యం అని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ పేర్కొన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని కేంద్ర కార్యాలయంలో చేపట్టిన కోటి మంది బీసీల సభ్యత్వాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవడానికి బీసీలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసుకుని, ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. 15 సంవత్సరాలు పై బడిన ప్రతి ఒక్కరికీ ఈ సభ్యత్వం ఇస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో కూడా సభ్యత్వ నమోదు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రియాశీల నాయకులకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటి సభ్యత్వ నమోదు కార్యక్రమ కన్వీనర్ వైద్యరాజగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి దేవేందర్‌గౌడ్, నాయకులు హైమావతి, రాజేందర్‌గౌడ్, వంగ రవి, దేవి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మణ్ తదితరులు

ఆదివాసీ, మావోయిస్టుల శవాలను వారి కుటుంబాలకు అప్పగించాలి

రాంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్‌లోని నారాయణపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో గుట్టలుగా పడి ఉన్న ఆదివాసీ, మావోయిస్టుల శవాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన ఆదివాసీ, మావోయిస్టుల శవాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలన్నారు. ఈ మేరకు ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక తరఫున హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం నాయకులు ఎన్.నారాయణరావు, చంద్రమౌళి, బల్ల రవీందర్, వెంకటన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో సీసీ రోడ్ల నిర్మాణం

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, మే 26 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో అన్ని బస్తీల్లో శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం కాచిగూడ డివిజన్ చప్పల్‌బజార్ రహ్మత్‌బాగ్‌లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. డ్రైనేజీ, మంచినీరు, వరదనీటి కాలువల నిర్మాణ పనులు పూర్తయిన తర్వాతనే సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అయిదు మున్సిపల్ డివిజన్లలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ ప్రశాంత్, జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ భావన, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, నాయకులు బి.కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాకారం గ్రంథాలయ పనులను పూర్తిచేయాలి



నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి

రాంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): బాకారం గ్రంథాలయ భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసి, ప్రజోపయోగంలోకి తీసుకురావాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజను కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాకారం గ్రంథాలయ భవనం కూల్చివేసి, నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. శంకుస్థాపన జరిగి మూడు సంవత్సరాలైనా ఇంతవరకు భవన నిర్మాణ పనులు పూర్తికాలేదన్నారు. దీంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనం అసాంఘిక కార్యకాలాపాలకు అడ్డాగా మారిందన్నారు. ఇకనైనా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి స్పందించి పనులు పూర్తిచేయాలన్నారు. నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వైవీ అర్హులందరికీ అందేలా చర్యలు



మాట్లాడుతున్న అరవింద్‌కుమార్

రాంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఈ పథకం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకులకు చేయూతనందించి స్వయం ఉపాధి కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి రాజీవ్ యువ వికాస పథకం చేపట్టారని అన్నారు. ఈ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి ప్రాజెక్టును బట్టి 50 వేల నుంచి రూ.4 లక్షల వరకు ఆర్థిక సహకారం లభిస్తుందన్నారు. దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైందన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ ఈ పథకం అందుతుందని, ఎవరు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి దరఖాస్తు చేసుకున్న వారందరికీ పథకం అందేలా కృషిచేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తున్నారని అన్నారు. పేద ప్రజలకు సన్న బియ్యం ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.

కిరాయిదారులను బెదిరించిన వ్యక్తిపై కేసు

బర్కత్‌పుర మే 26 (ఆంధ్రజ్యోతి): తనకు కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చిందని, ఈ ఇల్లు తనదేనని కిరాయిదారులపై దౌర్జన్యం చేయడమేగాక ఇంటి సామగ్రిని బయటపడేసిన వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ పీఎస్ పరిధిలోని సుందర్ నగర్‌లోని ఓ ఇంట్లో లక్ష్మణ్, అతని భార్య శంకరమ్మ 30 ఏళ్లుగా కిరాయికి ఉంటున్నారు. ఇల్లు తనదేనని కోర్టు తీర్పు తనకే అనుకూలంగా వచ్చిందని సలాం అనే వ్యక్తి పదిమంది అనుచరులను తీసుకొని వచ్చి సోమవారం ఇంటి సామగ్రిని బయటపడేశాడు. దౌర్జన్యం చేయడమే గాక ఇల్లు ఖాళీ చేయాలని బెదిరించాడు. బాధితులు కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సలాంతోపాటు అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

ఎన్టీఆర్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా తదితరులు

రాంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని ఈ నెల 28న ఉదయం 9 గంటకు సచివాలయం సమీపంలోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఘనంగా జరుగుతున్నాయని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా తెలిపారు. సోమవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఘాట్ వద్ద జరిగే ఈ వేడుకలకు ఎన్టీఆర్ కుటుంబ సభ్యులతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పిస్తారని తెలిపారు. నగరంలోని అన్ని నియోజకవర్గాలలో పార్టీ పతాకావిష్కరణ, ఎన్టీఆర్ నివాళి కార్యక్రమాలు, అన్నదానం, పేదమహిళలకు చీరల పంపిణీ వంటి సేవాకార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీరామారావుకు నివాళులర్పిస్తున్న నరసింహారెడ్డి, కళా జనార్దనమూర్తి

సినీ, రాజకీయ రంగాల్లో ఎన్‌టీఆర్ ముద్ర శాశ్వతం

చిక్కడపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయరంగాల్లో ఎన్‌టీఆర్ ముద్ర శాశ్వతమని ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో సోమవారం శతాబ్దిపూర్వ మహనీయులు కార్యక్రమం పరంపరలో భాగంగా డా.నందమూరి తారక రామారావు జయంతి కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష తెలుగుజాతికి ఈ ఆధునిక కాలంలో జాతీయస్థాయిలో గుర్తింపు, గౌరవం రావడానికి కారణం ఎన్‌టీఆర్ అన్నారు. ఈ సభలో టీడీపీ నాయకుడు నైషధం సత్యనారాయణమూర్తి, కళాపోషకుడు గుదిబండి వెంకటరెడ్డి, గాయని అన్నపూర్ణ, మల్లాది ఉష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిక్కా దేవదాసు

చేనేతపై జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వం భరించాలి

చిక్కడపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం చేనేతపై జీఎస్టీని భరించాలని చేనేత వర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు డా.చిక్కా దేవదాసు విజ్ఞప్తిచేశారు. సోమవారం చిక్కడపల్లిలో జరిగిన చైతన్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి రాగానే చేనేతపై జీఎస్టీని ప్రభుత్వమే భరిస్తుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర సందర్భంగా హామీనిచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ మేరకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర అవుతున్న క్రమంలో చేనేతపై జీఎస్టీని భరించాలని కోరారు. తెలంగాణలో చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండి, చేనేత పూర్వ వైభవం సంతరించుకుంటుందన్నారు. త్వరలో తమ బృందంతో ఈ విషయంలో సహకరించాలని సీఎంను కలుస్తామని దేవదాసు వివరించారు. ఈ సమావేశంలో చైతన్యవేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు నరేందర్, లక్ష్మి, సీత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపాల్

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్యం

చిక్కడపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): సీఎంరిలీఫ్ ఫండ్ పేదవర్గాలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని రామ్‌నగర్, కవాడిగూడ, ముషీరాబాద్ డివిజన్‌లకు చెందిన 12 మంది లబ్ధిదారులకు 4.34 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే సోమవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్‌ల బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, సాయికృష్ణ, దామోదర్‌రెడ్డి, దీన్‌దయాళ్‌రెడ్డి, శివముదిరాజ్, శ్రీధర్‌చారి, రాజశేఖర్‌గౌడ్, రాజేశ్, వల్లాల రవి, బల్ల ప్రశాంత్, సంతోష్, వెంకటేశ్, బల్వంత్, మధు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తాం

చిక్కడపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డివిజన్‌లోని పార్కుల వద్ద కూడా అభివృద్ధిపనులు త్వరలో పూర్తి చేస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని పార్కుల అభివృద్ధి కోసం మంజూరైన రూ.26లక్షల నిధులతో కొనసాగుతున్న జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అభివృద్ధి పనులను సోమవారం కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, సీనియర్ నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, డీఎస్.రెడ్డి, దోనేటి సత్యం, లక్ష్మీనారాయణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిపనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్



బండమైసమ్మనగర్ కమ్యూనిటీహాల్‌లో మాట్లాడుతున్న ఏసీపీ యాదగిరి

మైత్రి, పీస్ కమిటీ సభ్యులు పోలీసులకు వారధిగా పనిచేయాలి

కవాడిగూడ, మే 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల అదుపునకు పోలీసులకు, ప్రజలకు మధ్య మైత్రి కమిటీ సభ్యులు వారధిగా వ్యవహరించాలని గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎ.యాదగిరి సూచించారు. సోమవారం గాంధీనగర్ సబ్‌డివిజన్ పరిధిలోని కవాడిగూడ డివిజన్ బండమైసమ్మనగర్ కమ్యూనిటీహాల్‌లో మైత్రికమిటీ, పీసకమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ, సబ్‌డివిజన్ పరిధిలోని గాంధీనగర్, దోమలగూడ, లేక్‌పోలీస్‌స్టేషన్ పరిధులలో ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే మైత్రి, పీసకమిటీ సభ్యులు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా బోనాలు, గణేష్ నవరాత్రి ఉత్సవాలు, రంజాన్ పండగ సమయాల్లో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో దోమలగూడ ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గాంధీనగర్ సీఐ ఎన్.బోస్ కిరణ్, లేక్‌పోలీస్‌స్టేషన్ సీఐ చిట్టి, ఎస్ఐ నర్సింహ, హరీష్, పూజారి తిరుపతి, ఎఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ స్టేడియంలో మాట్లాడుతున్న చేనేత డ్వాక్రా మహిళా సంఘాల కార్యదర్శి కంభంపాటి పద్మజ తదితరులు

చేనేత వస్త్ర ప్రదర్శన జూన్ 9 వరకు పొడిగింపు

కవాడిగూడ, మే 26 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న చేనేత, హస్తకళాకరులతో తయరు చేసిన వస్త్రప్రదర్శన, హస్తకళల ప్రదర్శనను జూన్ 9వతేదీ వరకు పొడిగిస్తున్నట్లు చేనేత డ్వాక్రా మహిళా సంఘాల కార్యదర్శి కంబంపాటి పద్మజ తెలిపారు. సోమవారం ఎన్‌టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చేనేత వస్త్ర, హస్తకళాకారుల విజ్ఞప్తి మేరకు ఎగ్జిబిషన్‌ను మరో పదిరోజుల పాటు పొడిగిస్తున్నామని ఈ అవకాశాన్ని జంట నగరాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతనెల ఏప్రిల్ 26న ప్రారంభమైన వస్త్ర ప్రదర్శనకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించిందిందన్నారు. ఆధునిక కాలంలో కూడా చేనేత వస్త్రాలకు ఆదరణ తగ్గడం లేదన్నారు. చేతివృత్తి కళాకారులకు వినియోగదారులకు డైరెక్ట్‌గా మార్కెటింగ్ ప్లాట్‌ఫాం కల్పించే ఉద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో నిర్వాహకులు గోవింద్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేసిన తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ముషీరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం పద్మకాలనీలో ఓం తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ తైక్వాండో కలర్‌బెల్ట్ పరీక్షలో ఎంపిక కోసం మాస్టర్ ప్రసన్న ఆంజనేయులు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయని తెలిపారు. వాటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ సందర్భంగా 90మంది విద్యార్థులకు తైక్వాండో కలర్ బెల్ట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓం తైక్వాండో సలహాదారు గౌరీశంకర్, అధ్యక్షుడు రవికిరణ్, తైక్వాండో పోటీ నిర్వాహకులు సూర్య, శ్రీనిక, హాసిని, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

రాంనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సాయిమధుర నగర్‌లో జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేసిన నూతన రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి సూచించారు. సోమవారం సాయిమధుర నగర్‌లో వేస్తున్న రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోడ్డు పనులలో డ్రైనేజీ సమస్య నెలకొనడంతో జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్, సెల్‌పోన్ దొంగ అరెస్ట్

రూ.2.70లక్షల సొత్తు స్వాధీనం : రైల్వే డీఎస్పీ

బర్కత్‌పుర, మే 26 (ఆంధ్రజ్యోతి) : రైలులో ల్యాప్‌టాప్, సెల్‌పోన్ దొంగతనానికి పాల్పడుతున్న ఓ దొంగను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.2.70లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్ఎన్.జావేద్, కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప, ఆర్‌పీఎఫ్ సీఐ మాల్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. గౌలిగూడలో నివాసం ఉంటున్న వేదప్రకాష్‌శర్మ కుమారుడు నవనీత్‌శర్మ(32) గార్మెంట్ బిజినెస్ చేసేవాడు. నష్టాలు రావడంతో అప్పులు తీర్చడానికి దొంగతనాలను ఎంచుకున్నాడు. రైలులో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ దొంగతనాలు చేశాడు. ఈ నెల 21న ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికుడి ల్యాప్‌టాప్‌ను చోరీ చేశాడు. అదే విధంగా 13 సెల్‌ఫోన్లను కూడా దొంగతనం చేశాడు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకుని విచారించగా దొంగతనాలను ఒప్పుకున్నాడు. అతడి నుంచి రూ.2.70 లక్షల విలువ గల ఒక ల్యాప్‌టాప్, ఆపిల్ ఐ ప్యాడ్, చార్జర్, 13 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. దొంగను రైల్వే కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండడగా ప్యాసింజర్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మలక్‌పేట - కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య 50 ఏళ్ల వయసు గల వ్యక్తి పట్టాలు దాటుతుండడగా ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలులో ప్రయాణికుడి ఆభరణాలు, నగదు చోరీ

అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ ప్రయాణికుడి బంగారు ఆభరణాలు, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... లింగంపల్లికి చెందిన రఘునాథ్ (35) అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తున్నాడు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో రఘునాథ్ బ్యాగును దొంగలు తస్కరించారు. ఆ బ్యాగులో 15 గ్రాముల బంగారు ఆభరణాలు, వెయ్యి రూపాయల నగదు, రెండు సెల్‌ఫోన్లు ఉన్నాయి. సోమవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీచేసినట్లు సీఐ తెలిపారు.